

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
బుధవారం 3 జూలై 2024



అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలి 8వ పేజీ
సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి 8వ పేజీ

బిందు సేద్యం సాధ్యమయ్యేనా..?

మంత్రి తుమ్మల ఆదేశాలతో అన్నదాతల్లో ఆశలు
దరఖాస్తుల స్వీకరణ షురూ



జగిత్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో బిందు సేద్యం విధానాన్ని ప్రోత్స హించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలీ కృతమై ఎంతమేరకు విస్తరణ సాధ్యమవుతుందన్న అభి ప్రాయాలు చోటు చేసుకున్నాయి. సాగునీటి సమస్య.. మరో పక్క కూలీల కొరవెరసి వ్యవసాయం అనుబంధ సాగుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండటం, అధికనీటి వినియోగం, ఏ యేటికి ఆ యేడు దిగుబడి తగ్గుతుండటం వంటి పరిస్థితులు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అన్నదాతలను కుంగదీస్తున్నాయి.

ఈ నేపథ్యంలో బిందు, తుంపర సేద్యం ద్వారా అధికాదాయం పొందవచ్చని ప్రభుత్వం చెబుతోంది. డ్రిప్ సాగును విస్తరింపజేయాలని వ్యవసాయ అధి కారులకు ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించడంతో ఈ వానాకాలం నుంచే అమలుకు చర్యలు తీసుకుంటు న్నారు. తాజాగా హైదరాబాద్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ అధికా రులు, ఉద్యాన వనశాఖ అధికారుల తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వ్యవసాయశాఖ సమీక్షలో సైతం ఆయిల్‌పామ్, డ్రిప్ ఇరిగేషన్‌లపై పలు అంశాల ను ప్రస్తావించడం ప్రాధా న్యతను సంతరించుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్, ఉద్యానవన పంటల సాగును బిందుసేద్యం ద్వారా చేపట్టాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

● రాయితీలు ఇలా...

బిందు సేద్యంపై ఎస్సీ, ఎస్టీ, రైతులకు పూర్తిగా ఉచితంగా అంటే 100 శాతం రాయితీపై డ్రిప్ పరిక రాలను ప్రభుత్వం అందిస్తుంది. బీసీ, సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ వర్తిస్తుంది. పంటల సాగును బట్టి ఒక్కో యూనిట్ ధర ప్రతి హెక్టారు కు రూ. 33,500 నుంచి రూ. 1,44,000 వరకు రాయితీ అందుతుంది. ఇప్పటి వరకు డ్రిప్ పరికరాలకు రైతులు వందల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నట్లుగా సంబంధితశాఖ అధికారులు చెబుతున్నారు. బిందు సేద్యం ద్వారా 50 శాతం నీటి ఆదాతో పాటు ఎరువులు కూలీల ఖర్చు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఆసక్తి కలిగిన రైతులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలి. దరఖాస్తులో ఏ పంట సాగు చేస్తారో అనే విషయం తెలపాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు.

ప్రోత్సహించే పంటలు..

జిల్లాలో ప్రధాన పంటలైన పసుపు, మామిడి లతో పాటు పత్తి, మొక్క జొన్న, జామ, బత్తాయి, మిరప, దానిమ్మ, ఆయిల్‌పామ్, కూర గాయల పంటలు, పూలసాగుకు డ్రిప్ విధానం అమలు కానుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల ఎకరాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సుమారు 1,600 ఎకరాలు ఆయిల్ పామ్, సుమారు 400 ఎకరాల్లో ఇతర ఉద్యానవన పం టలు, కూరగాయల సాగును లక్ష్యంగా నిర్ణయిం చారు. మూడు రోజుల క్రితం ఈ మేరకు నిర్ణ యించిన లక్ష్యాన్ని రాష్ట్ర స్థాయి అధికారులు వివిధ జిల్లాల అధికారులకు అంద జేశారు. కాగా బిందుసేద్యంపై రైతులకు సంపూర్ణ అవగాహన లేకపోవడం, రాయితీపై పల్లెల్లో ప్రచారం లేక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం మేరకు బిందు సేద్యం సాధ్యమవుతుందా... లేదా అన్న అనుమానాలు నెలకొంటున్నాయి.

లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం

ప్రతాప్ సింగ్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి



జిల్లా వ్యాప్తంగా బిందు సేద్యం లక్ష్యాన్ని ఇటీవల నిర్ణ యించడం జరిగింది. బిందు సేద్యం వైపు రైతులను ప్రోత్స హించేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. బిందు సేద్యంపై కర్షకుల నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల ఎకరాలలోపు బిందు సేద్యం చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాము.

పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాల అర్బన్, జూలై 2: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికు ల బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సం దర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాల యం ఎదుట తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలిండర్, కో డిగుడ్లు సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ బి ల్లులు పెంచాలని, ప్రతి కార్మికురాలికి పీఎఫ్, ఈఎస్ఐ భీమా, పెన్షన్ సౌక ర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెన్న మహేష్, గుగ్గిల్ల శారద, కట్ల లక్ష్మీ, ఎండీ షంషీర్ తదితరులున్నారు.

విద్యారంగాన్ని, నిరుద్యోగులను

రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోంది

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 2: రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి విద్యారంగాన్ని, నిరుద్యోగులను ఆయా ప్రభుత్వాలు విస్మరించడం విచారకరమని ఏబీవీపీ రా ష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ గ్రూప్ పరీక్షల పోస్టులను పెంచాలని, 25వేలతో మెగా డీఎస్సీని నిర్వహించా లని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల్లో భాగంగా హామీ ఇచ్చిన రెండు లక్ష ల ఉద్యోగాల భర్తీ చేస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరు ద్యోగులతో పాటు విద్యారంగాన్ని సైతం పూర్తిగా విస్మరించడం విచారకరం అన్నారు. నిరుద్యోగ వ్యతిరేక పాలనను అంతమొందించి విద్యార్థి, నిరుద్యోగు లకు న్యాయం చేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజు, మనువాడ నందు, మాడవేణి సునీల్, ప్రశాంత్, సిద్ధూ తో పాటు విద్యార్థులున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో

ధర్మపురి, జూలై 2: ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయా లిసిస్ సెంటర్‌ను జగిత్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ ఎండీ సమియొద్దీన్ మంగ ళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది పని తీరు, పేషంట్లకు అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ ధర్మపురి, బుగ్గారం, వెలగటూర్ మండలాల్లోని కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఈ సౌకర్యాన్ని వినియోగిం చుకోవాలని కోరారు. గత నెలలో 17 మందికి డయాలిసిస్ సేవలను ధర్మపురి సెంటర్‌లో అందించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది 177 మందికి డ యాలిసిస్ సేవలు అందించామని ఆయన వివరించారు. ఆయన వెంట జగి త్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌ఈవోలు రాజేశం, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

జగిత్యాలరూరల్, జూలై 2 : జగిత్యాల రూరల్ మండలంలోని పడిగెల ఆగవ్వ (103) అనే శతాధిక వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. గత కొన్ని రోజులుగా ఆగవ్వ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దనే ఉంటోంది. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల టౌన్, జూలై 2 : పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ చేపట్టినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. మున్సిపల్ కా ర్యాలయంలో మంగళవారం చైర్ పర్సన్ ఆధ్వర్యంలో ప్ర జా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వార్డు ల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో చైర్ పర్సన్‌కు అందజేశారు. ప్రతి సమస్యలను సకాలంలో పరిష్కరించేలా కృషి చేయాలని సంబంధిత అధికారులకు చైర్ పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. ము న్సిపల్ కమిషనర్ చిరంజీవి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కార్మికుల వినతి

జగిత్యాల అర్బన్, జూలై 2: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులకు ఉన్న సమస్యలను సత్వరమే పరి ష్కరించాలని కోరుతూ టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిపో మేనేజర్‌ను కలిసి వినతిప త్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ హైదరాబాద్ రూట్లో నడుస్తున్న సింగిల్ క్రూ డ్యూ టీలను తగ్గించిన 21నిమిషాల ఓటీని తిరిగి పునరుద్ధరిం చాలని, సెలవు కోరిన కార్మికులకు నెలకు కనీసం మూడు రోజులు సెలవు ఇవ్వాలని, వరంగల్ రూట్లో నడుస్తున్న సింగిల్ క్రూ డ్యూటీలకు ఇచ్చిన రెండు గంటల రెస్ట్ సమ యాన్ని తొలగించాలని, కరీంనగర్ జేబీఎస్ రూట్లో నడు స్తున్న స్పెషల్ ఆఫ్ డ్యూటీలకు మూడు గంటలు రెస్ట్ ఇ వ్వడం వల్ల బస్సులో ప్రయాణికులు గొడవచేస్తున్నార న్నారు. కావున కరీంనగర్ జేబీఎస్ రూట్లో నడిచే స్పెషల్ ఆఫ్ డ్యూటీలకు ఇచ్చిన మూడు గంటల రెస్ట్ సౌకర్యం వినియోగించుకునేలా జేబీఎస్ బస్టాండ్‌లో రెస్ట్ రూం సౌ కర్యం కల్పించాలన్నారు. బస్సుల హెడ్ లైట్‌ల వెలుతురు సరిగా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఎక్కువ వెలుతురు వచ్చే ఎల్ఈడీ లైట్‌లు అమ ర్చాలన్నారు. వీటితో పాటు డిపోలోని కార్మికులకు జగి త్యాల డిపో కార్మికులకు జిల్లాలోనే ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పా టు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి స్వా మి, కోశాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఖబడ్దార్

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హెచ్చరిక ● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 2: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టానుసా రంగా మాట్లాడితే ఖబడ్దార్ అంటూ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. జగిత్యాల పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సమావేశం లో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి గురించి ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లాడని మాట్లాడిన కేటీఆర్ తన సోదరి కవిత ప్రస్తుతం ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించారు. తాము ఎవరిని పార్టీ మారాలని చెప్పలేదని, వారే అభివృద్ధి కాంక్షించి స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారం చేపట్టిన కేసీఆర్ ఇచ్చిన హామీ లను ఎన్ని అమలు చేశారో కేటీఆర్ చెప్పాలన్నారు. అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చితే మీరు అధికారం ఎందుకు కోల్పోతారని, మీకు తక్కు వ ఓట్లు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డికి మ ద్దతుగా ఉన్నారని తెలిసే విధంగా ప్రజలు నిర్ణయాలు ఉన్నాయన్నారు. గతంలో భట్టి విక్రమార్క నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను మీ పార్టీలో ఎలా చేర్చుకున్నారో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు తలదించుకునే వి ధంగా కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ కేసులో జైలులో ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక సీటు కూడా గెలవని కేటీఆర్ ముఖం ఎక్కడ పెట్టుకుంటారన్నారు. గతంలో సీఎం కేసీఆర్‌ను కలిసే పరిస్థితి లేదని, సమస్యలు విన్నవించుకునే స్వే చ్ఛ ప్రజలకు లేదన్నారు. గ్రూప్స్ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ విషయంలో కేటీఆర్ పీఏ ఉన్నాడని తెలిసి అతనిపై ఎందుకు విచారణ జరపలేదన్నారు. కేసీఆర్ పది ఏళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో ఇక్కడి నీళ్లు సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు తీసుకెళుతున్నా పట్టించు కోలే దన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్య క్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేములు రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్ జ క్కు పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మైనార్టీ అధ్యక్షులు ఎం డీ రఫియొద్దీన్, పట్టణ అధ్యక్షులు అప్పం తిరుపతి, బీసీ సెల్ అధ్యక్షులు ఒజ్జల లక్ష్మణ్, సుముఖ్, సీపతి సత్యనారాయణ, చీపిరిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ మురళి పాల్గొన్నారు.



ధర్మపురిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్ కలిశారు. అయిదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటు న్న బీఆర్ఎస్ జడ్పీ చైర్మన్లను ఎర్ర వెల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీ ఎం కేసీఆర్ సత్కరించారు. ఇందులో దావ వసంత సురేశ్ దంపతులను సై తం శాలువలతో సత్కరించారు. కు టుంబ సమేతంగా మాజీ సీఎం కేసీ ఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను జడ్పీ చైర్‌పర్సన్ మర్యాద పూర్వకంగా కలి సి కృతజ్ఞతలు తెలిపారు.

●చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మంగళవారం జడ్పీ చైర్‌ప ర్సన్ పరామర్శించారు. ఎమ్మెల్యే మేడి పల్లి సత్యం భార్య రూపాదేవీ ఆత్మహ త్యకు పాల్పడడంతో శోకసంద్రంలో మునిగిన ఆ యనను హైద్రాబాద్‌లోని నివాసంలో కలిసి ఓ దార్చారు. రూపాదేవీ మృతి పట్ల సంతాపం తెలిపారు.



మాజీ సీఎం కేసీఆర్‌తో జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

కొత్త చట్టాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

జగిత్యాల అర్బన్, జూలై 2: క్షేత్రస్థాయిలో నూతన చట్టాలపై అవగాహన ప్రధానమని న్యాయవాదులు త మ అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో 10స్పెషల్ అవేర్నెస్ క్యాంపెనిం గ్‌లో భాగంగా మంగళవారం నూతన భారతీయ న్యా య సంహిత పై పట్టణంలోని స్థానిక ఎస్ఎస్‌వీ , శ్రీ వాణి జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ సమా నత్వం, ఆడపిల్లల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు దబ్బు లక్ష్మారెడ్డి, అడ్వకేట్స్ బండ భాస్కర్‌రెడ్డి, శ్రీవాణి, ఎన్ఎస్‌వి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు దామోదర్‌రావు, నరేష్, లీగల్ కౌన్సిలర్ సఖి లావణ్య, డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ అశ్విని, జెం డర్ స్పెషలిస్ట్ గౌతమి స్వప్నతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి హై స్కూల్‌లో కిక్ బాక్సింగ్ డే



కిక్ బాక్సింగ్ డిస్ట్రిక్ ప్రెసిడెంట్ సుమన్‌కు కేక్ తినిపిస్తున్న ఉద్యోగులు

జగిత్యాల అర్బన్, జూలై 2: పట్టణంలోని స్థానిక జ్యో తి హై స్కూల్ ఐఐటీ అకాడమీలో జాతీయ కిక్ బా క్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను కన బర్చిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశా రు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పిల్లల వైద్యులు, కిక్ బాక్సింగ్ డిస్ట్రిక్ ప్రెసిడెంట్ డాక్టర్ మోర సుమన్ మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను సాధించవచ్చునని అన్నారు. కిక్ బాక్సింగ్ ద్వారా శారీరక ధృడత్వం, మా నసిక పరిపక్వత సిద్దిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియాల హరి చరణ్‌రావు, శ్రీధర్‌రా వు, ఉపాధ్యాయ బృందంతో పాటు తెలంగాణ కిక్ బా క్సింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు ఉన్నారు.

రైతుబంధుపై సలహాలు అందించాలి

● ఏవో ముక్తేశ్వర్.. ● రైతుల నుంచి అభిప్రాయాల సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

రాయికల్, జూలై 2: రైతులు రైతుబంధుపై సలహాలు, సూచనలు అందిం చా లని ఏవో ముక్తేశ్వర్ అన్నారు. మండలంలోని భూపతిపూర్ సహకార సంఘంలో మంగళవారం రైతుబంధు ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏవో మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ద్వారా పొందే రైతు పెట్టుబడి సహాయం రైతుబంధు కొంత మంది రైతులు 5 ఎకరాల వరకు, మరికొంత మంది రైతులు కనీసం 10 ఎకరాల వరకు పంట సాగు చేసే భూములకు ఇవ్వాలని తెలుపుతూ ఏకగ్రీవ తీర్మా నం చేశారు. సన్న రకాల వరిధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడమే కాకుండా అన్ని రకాలైన సన్న, దొడ్డు రకా ల వరిధాన్యాలకు కూడా ఇవ్వాలని తీర్మానం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పం ట నష్టం జరిగితే నష్ట పరిహారం పంట బీమా సౌకర్యం కల్పించాలని, డ్రిప్ పరి కరాలు సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ అసిస్టెంట్ స్వప్న, సంఘం ఉపాధ్యక్షుడు మల్లయ్య గౌడ్, కార్యదర్శి చం ద్రశేఖర్, డైరెక్టర్లు కోసరి మహేష్, గంగరాజం, భారతి శేఖర్‌రెడ్డి, గంగరాజు లక్ష్మణ్, భూపతిపూర్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, సిబ్బంది రాజేష్, రంజిత్ పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని నందగిరిలో మంగళవారం రైతు భ రోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రైతు భరోసా ఎన్ని ఎక రాల వరకు ఇవ్వాలి, సాగు భూములకేనా, సాగు చేయని భూములకు సైతం ఇవ్వాలా లాంటి విషయాలను రైతుల అభిప్రాయం రూపంలో సేకరించారు. సమావేశంలో మంచిర్యాల డీసీవో రాంమోహన్, సంఘం చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, సీఈవో రవీందర్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వెల్గటూర్: రైతు బంధు పథకం ఎలాంటి రైతలకు ఇస్తే బాగుంటుంది అనే వి షయంపై డీసీవో రామ్మోహన్ ఆధ్వర్యంలో వెల్గటూర్ మండల రైతుల నుంచి అభి ప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వెల్గటూర్ రైతు వేదికలో మంగళ వా రం వెల్గటూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు బంధు ప్రత్యేక సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ని ఎకరాల లోపు ఉన్న రైతులకు రైతు బంధు పథకం వర్తింపజేస్తే బాగుంటుందని రైతుల నుంచి అభిప్రాయం సేకరించారు. కొం త మంది రైతులు 5 ఎకరాల లోపు మరి కొంత మంది 10 ఎకరాలలోపు ఉన్న సా గు భూములకు రైతు బంధు పథకం వర్తింపజేయాలని అభిప్రాయం వెలిబుచ్చా రు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్, వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్ట ర్లు, పీఏసీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





జైలుకు వెళ్లి వచ్చినా మారని బుద్ధి

- చోరీకి పాల్పడ్డ నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- 8 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 20వేలు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు


వివరాలు తెలుపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూలై, 2: మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడి తప్పించుకుంటూ తిరుగుతున్న పాత నేరస్తుల్ని పోలీసులు అరెస్టు చేసిన ట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మంగవారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా చెందిన మాదాపూర్ గ్రామస్థుడు దర్పల్లి సాయిలు, బాసరకు చెందిన కొసిడియా మోహన్ పలు చోరీ కేసుల్లో గతంలో జైలుకు వెళ్లి జూన్ 3న విడుదలై బయటకు వచ్చారు. దర్పల్లి సాయిలు చిన్నతనం నుంచి జల్సాల కోసం దొంగతనా లకు పాల్పడుతుండేవాడు, భార్యను హింసించడంతో వదిలిపెట్టి పోయిం ది. అప్పటి నుంచి అతనిపై 20 చోరీ కేసులతో పాటు హైదరా బాద్‌లో మర్డర్ కేసులు కూడా ఉన్నాయి. కొసిడియా మోహన్‌పై 14 చోరీ కేసులు పలు పోలీసు స్టేషన్‌లో కేసులు ఉన్నాయి.

మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన జోగిరి శంకర్ జూన్ 22 ఇంటికి తాళం వేసి షిరిడీ యాత్రకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. జూన్ 24న రాత్రి సమయంలో దర్పల్లి సాయిలు, కొసిడియా మోహన్ తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 5తులాల బంగా రు బిస్కెట్, తులం బంగారు చైను, 2 తులాల బంగారు తీగ, 10 తులాల వెండి కండితో పాటు రూ. 1.50లక్షలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసు కున్న జోగిరి శంకర్ తిరిగి ఇంటికి వచ్చి విషయాన్ని పోలీసులకు తెలపడంతో కేసు నమోదు చేశాడు. దీంతో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో చుట్టు పక్కల ప్రదేశాలను సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌కుమార్ పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి సీఐ, ఎస్సైలు గాలింపు చర్యలు జరిపారు. ఈ క్రమంలో మంగళవారం గండిహనుమాన్ ఆలయం సమీపంలో దర్పల్లి సాయిలు, కొసిడియా మోహన్‌లు అను మానాస్పందంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మేడిపల్లిలో దొంగతనం చేసినట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు బైకులను దొంగిలించినట్లు అంగీకరించారు. వారి నుంచి చోరీ చేసిన బంగారం, వెండి నగలు, రూ. 20వేల నగదు, 3 ద్విచక్ర వాహనా లను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్, కానిస్టేబుల్ కిరణ్, సంతోష్, చైతన్య, మహేందర్‌లను డీఎస్పీ అభినందించారు.

వేములవాడలో మహిళా కండక్టర్ అత్యుత్సాహం

- ఫ్రీ బస్ కాదని మహిళా ప్రయాణికులను దించిన వైనం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

వేములవాడ టౌన్, జూలై 2: ఆర్టీసీ బస్సులో మహిళ కండక్టర్ ప్రయాణికులపై అత్యుత్సాహాన్ని ప్రదర్శించిన సంఘటన సోమవారం వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండులో చోటు చేసుకుంది. మహిళ కండక్టర్ ప్రయాణికులతో మాట్లాడిన తీరును అక్కడే వున్న యువకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. వరంగల్‌కు చెందిన భక్తులు వేములవాడ రాజ రాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని తిరిగి కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం చూస్తున్న మహిళ ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల వెళుతున్న క్రమంలో కొండగట్టు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న మహిళ ప్రయాణికులపై కండక్టర్ కోపాన్ని చూపించింది. ఇది ఫ్రీ బస్సు కాదని, చెకింగ్ ఆఫీసర్‌కు దొరికితే రూ 500 ఫైన్ కట్టాలని, ఒక్కసారి చెబితే వినపడటం లేదని బెదిరించి బస్సులోంచి దించి వేసింది. దీంతో చేసేదేమి లేక ప్రయాణికులు బస్సు దిగిపోయారు. ఈ సంఘటను గమనిస్తున్న ఓ యువకుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రికరించి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ విషయంపై డిపో మేనేజర్ మురళికృష్ణను వివవణ కోరగా బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నా రని, వేములవాడలోని జగిత్యాల బస్టాండు నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు వచ్చే ప్రయాణికులు కావడంతో అలా మాట్లాడిందన్నారు. ప్రయాణికులతో అలా మాట్లాడటం సరైంది కాదని సదరు మహిళ కండక్టర్‌ను డ్యూటీ నుంచి పక్కన పెట్టామని, విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులు పంపిస్తానని తెలిపారు.

స్వదేశానికి రప్పించాలని వేడుకోలు

వెల్గటూర్, జూలై 2: విదేశంలో అనారోగ్యంతో బాధ పడుతున్న వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటకు చెందిన వ్యక్తిని స్వదేశానికి రప్పించేలా కృషి చేయాలని ఆయన బంధువులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. బంధువుల సమా చారం ప్రకారం జగదేవ్‌పేటకు చెందిన గంగుల మహేష్ గత సంవత్సరం డిసెంబరు 31న ఉపాధి నిమిత్తం మాల్దీవ్స్‌కు వెళ్లాడు. ఈ మధ్యన అతడు అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడ కంపెనీ యాజ మాన్యం పట్టించుకోవడం లేదు. ఇండియాకు రావడానికి ఎగ్జిట్ పర్మిషన్ కూడా ఇవ్వడం లేదు. మెరుగైన చికిత్స కోసం మహేష్‌ను స్వదేశానికి రప్పించేలా చూడాలని ఆయన బంధువు కనకయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నారుమడి ధ్వంసం

జగిత్యాలరూరల్, జూలై 2 :జగిత్యాల రూరల్ మం డలం గుల్రాజ్‌పల్లికి చెందిన కీలక నేత కొందరు వ్యక్తుల చేత తన నారుమడిని ధ్వంసం చేశారని గుల్రాజ్‌పల్లికి చెందిన కల్లెపల్లి తిరుపతి ఆరోపించారు. గుల్రాజ్‌పల్లికి చెందిన సదరు నాయకుడికి ఎన్నికల్లో అనుకూలంగా పనిచేయనందుకు భూవివాదంలో తలదూర్చి తనపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఖతార్ దేశం నుంచి వీడియో సందేశం ద్వారా తిరుపతి తన ఆవేదన వ్యక్తపరిచాడు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి అరెస్ట్

మెట్‌పల్లి, జూలై, 2 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణం లో ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏప్రిల్‌లో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పట్టణంలోని కటకం ప్రకాష్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా కటకం పాన్ బ్రోకర్స్ పేరుతో వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేయడానికి వెళ్లారు. దాడుల్లో ఎలాంటి ఆధారులు లేకుండా అక్రమం గా నిల్వ ఉన్న బంగారం, నగదును సీజ్ చేస్తుండగా కటకం ప్రకాష్, కటకం కార్తీక్‌లతో పాటు కుటుంబ సభ్యులు అడ్డు తగిలి పోలీసులపై దాడికి యత్నిస్తూ, దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగిం చినట్లు ఎస్సై చిరంజీవి తెలిపాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసి ఈనెల 1న మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.





కోనేరుకు తాళం


కోనేరు బయట ఉన్న భక్తులు

సారంగాపూర్, జూలై 2 : మండలంలోని దుబ్బ రాజన్న ఆలయంలో కోనేరుకు నిత్యం తాళం వేసి ఉంటోంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తు లు నిరాశతో వెనుతిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజన్న ఆలయానికి ప్రతి సోమవారం స్వామి వారిని దర్శించుకు నేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చిన భక్తు లు ముందుగా కోనేరు వద్దకు వెళ్లి స్నానాలు చేసి ఆలయానికి వెళ్తారు. మహాశివరాత్రి ఉత్సవాలకు తప్ప ఎప్పుడూ తాళం వేసి ఉంచుతున్నారు. దీంతో ప్రతి సోమవారం వచ్చే భక్తులు కోనేరు వద్దకు వచ్చి చూసి తాళం ఉండటంతతో నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్తున్నారు. కోనేరుకు అన్ని సౌ కర్యాలు ఉన్నప్పటికీ కూడా అధికారులు తాళం వేసి ఉంచడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల కోరిక మేరకు ప్రతి సోమవారం రోజైనా కోనేరులో నీటిని నింపి అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రాజన్న కోడెల పంపిణీకి రంగం సిద్ధం

మూడు వందల కోడెలకు వచ్చిన దరఖాస్తులు

వేములవాడ కల్చరల్, జూలై 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించే నిజకోడెలను అర్హులైన రైతులకు ఉచితంగా ఉందించేందుకు రంగం సిద్ధమైంది. రాజన్న కోడెలను, ఆవుల సంఖ్య ఎక్కువ పెరగడంతో ఆసక్తి గల అర్హులైన హిందూ మతానికి చెందిన రైతులు, ఆలయ గోశాలలు, ప్రైవేటు గోశాలలు, హిందూమఠాల వారికి అందించేందుకు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ప్రతి పాదనలు సిద్ధం చేశారు. ఈ నెల 9వ తేదీ వరకు ఆసక్తి గల వారు రాజ న్న కోడెలకు ఆన్‌లైన్ ద్వారా, పోస్ట్ లేదా నేరుగా రాజన్న ఆలయంలో వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి దరఖాస్తులకు ఆహ్వానాన్ని పలికారు. మంగళవారం వరకు మూడు వందల దరఖాస్తులు వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు.

నేడు ప్రభుత్వ విప్ చేతుల మీదుగా పంపిణీ..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి తిప్పాపూర్ గోశాల నుంచి కోడెల ను దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందించనున్నట్లు ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్ మంగళవారం తెలిపారు. రాజన్న కోడెలు కావాలని సుమారుగా మూడు వందల దరఖాస్తులు వచ్చాయని వారికి బుధవా రం మధ్యాహ్నం 2 గంటలకు రాజన్న కోడెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, జూలై 2: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి లోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోస్కుల సూర్యప్రకాష్‌కు హన్మ కొండ జిల్లా వేలేరుకు చెందిన వేముల వెంకటమల్లు రెండో కుమార్తె కవితతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందన్నారు. గోస్కుల సూర్య ప్రకాష్ ఐదు సంవత్సరాల నుంచి తన భూమిని అమ్ముతానని అంటుండడంతో పిల్లల భవిష్యత్తు గురించి భూమి అమ్మ వద్దని కవిత అడ్డు చెప్పేదన్నారు. అయినా వినకుండా సూర్యప్రకాష్ సగం భూమిని అమ్మేశాడన్నారు. మిగతా భూమినైనా పిల్లల మీద మీద చేపించమని కవిత అడుగుతుంటే భర్త సూర్య ప్రకాష్, అత్త సులోచన, మామ మొగులయ్యలు అవమానించి, వేధింపులకు గురి చేశారని, దీంతో తన కూతురు కవిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కవిత తండ్రి వెంకటమల్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలి

● ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి ● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం అందించాలి ● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి రాంచందర్

సిరిసిల్ల, జూలై2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అధికారులు, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవలను అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌బాబు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, రీసెర్చ్ అధికారి డి వరప్రసాద్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఎస్సీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను కలెక్టర్ వివరించారు. జిల్లా అధికారులు, శాఖల వారీగా తమ నివేదికలు చదివి వినిపించారు. అట్రాసిటీ కేసుల వివరాలు, ప్రగతిని తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో రూల్‌ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలని ఆదేశించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



రామచంద్రంను సన్మానిస్తున్న కలెక్టర్

● దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై చట్టరీత్యా చర్యలు

జిల్లాలో గతంలో జరిగిన నేరెళ్ల ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, రామరాజ్యంలో రావణకాష్టం జరిగిందని దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచంద్రం తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిషన్ సభ్యుడు రాంచంద్రం ఎదుట నేరెళ్ల బాధితులు ఈశ్వర్, చెప్యాల బాలరాజు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఒక బాధితుడికి రెండు కిడ్నీలు పాడయ్యాయని అతనికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ నేరెళ్ల ఘటనలో బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారికి ప్రమోషన్ వచ్చిందనే విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నేరెళ్ల ఘటనలో ఉన్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి తన వంతు కృషి చేస్తానని, నేరెళ్ల బాధితులకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నేరెళ్ల బాధితులకు న్యాయం జరగలేదని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలని సూచిస్తామన్నారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్‌భూముల పట్టాలు అందించే అవకాశంపై అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని అన్నారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం వసతి సౌకర్యం, బెస్ట్ అవెలెబుల్ స్కూల్స్‌పై సమీక్షించామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో సకాలంలో పరిష్కారం చూపాలని, వీటిపై పార్లమెంట్‌లో 2018లో 18ఏ సెక్షన్ కింద ఎస్సీలకు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్థులను అరెస్ట్ చేయాల్సి ఉంటుందని అన్నారు. అన్యాయం జరిగిన ప్రజలకు అండగా కమిషన్ ఉంటుందన్నారు. సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎస్సీ కమీషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబు, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఒడిశా టూ వేములవాడ

● గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
● 14.59కిలోల గంజాయి సీజ్

వేములవాడ టౌన్, జూలై 2: గుట్టుచప్పుడుకాకుండా ఓ వ్యక్తి ఒడిశా నుంచి వేములవాడకు గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం మీడియా సమావేశంలో నిందితుడిని అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన పుర్టీ బిర్స అనే వ్యక్తి ఒడిశాలోని నబరంగాపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి వేములవాడ, సిరిసిల్ల చుట్టపక్కల ప్రాంతాలలో గంజాయికి అలవాటు పడినవారికి విక్రయిస్తున్నాడని అన్నారు. గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేందుకు వేములవాడకు వస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పోలీసులు పకడ్బందీగా పట్టణంలోని చెక్కపల్లి రోడ్డు శివారులోని పెద్దమ్మ ఆలయం సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా పట్టుకున్నారని తెలిపారు. అతని వద్ద వున్న బ్యాగ్‌ను తెరిచి చూడగా 14 కిలోల 590 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. గంజాయి కొన్నా, సేవించినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి బారినపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అక్రమ గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 41 కేసులలో 99 మందిని అదుపులోకి తీసుకుని 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయికి అలవాటు పడిన వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి గంజాయి వలన కలిగే అనర్థాలపై, కేసులపాలైతే జరిగే నష్టాల గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గంజాయికి అలవాటు పడి మానుకోలేని స్థితిలో ఉన్నవారి కోసం జిల్లాలో డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు.జిల్లాలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసినా, చూసినా 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగను పట్టుకున్న రైతులు

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామడుగు,జూలై2: గత కొద్ది నెలలుగా రామడుగు మండలంలోని వివిధ గ్రామాల్లో వరద కాలువకు అమర్చుకున్న మోటార్లు, వైర్ కేబుల్‌లను ఎత్తుకెళ్తూ రైతులకు మనశ్శాంతి లేకుండా దొంగను ఎట్టకేలకు మంగళవారం రైతులు పట్టుకున్నారు. మరో ఇద్దరు దొంగలు పారిపోయారు. పట్టుకున్న దొంగను రైతులు పోలీసులకు అప్పగించారు. రైతుల కథనం ప్రకారం.. రామడుగు మండలం షానగర్ గ్రామ శివారులోని వరదకాలువ పంట పొలాల కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లను గత కొద్ది నెలలుగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతూ రైతులకు కునుకులేకుండా చేస్తున్నారు. అయితే రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిఘా పెట్టి రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. మంగళవారం వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తితో పాటు మరో ఇద్దరు వైర్లు దొంగిలించే ప్రయత్నంలో రైతులు ఒక దొంగను పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయారు. అనంతరం పోలీసులకు అప్పగించినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం ఓ దొంగ పోలీసుల అదుపులో ఉండగా సదరు వ్యక్తిని విచారిస్తున్నట్లు తెలిసింది.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 2 : మండలంలోని నిట్టూరు గ్రామ శివారులో మంగళవారం ట్రాక్టర్ ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందడంతో పాటు , ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన ఆరే సదయ్య అతని భార్య లక్ష్మీ (38)లు చొప్పదండిలో బోనాల పండుగకు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో నిట్టూరు గ్రామం వద్ద ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో రావడంతో ఢీకొట్టగా లక్ష్మీ అక్కడికక్కడే మృతిచెందింది. సదయ్యకు తీవ్ర గాయాలైనట్లు సదయ్య సోదరులు కుమార్ తెలిపారు. రాంగ్ రూట్‌లో ట్రాక్టర్ నడుపడంతో పాటు ఒకరి ప్రాణాన్ని బలిగొన్న డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి పోలీసులకు కుమార్ ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 2: మండలంలోని పెద్దకల్వల గ్రామం వద్ద మంగళవారం కారు ఢీకొని దరావత్ సత్తమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యదాద్రి భువనగిరికి చెందిన దరావత్ సత్తమ్మ బతుకుదెరువు కోసం పెద్దకల్వల గ్రామంలో నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం రాజీవ్ రహదారి దాటుతుండగా కారు ఢీకొనడంతో సత్తమ్మ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి మనువడు దరావత్ వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గొల్లపల్లి, జూలై 2: మండలంలోని అగ్గిమల్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ జీవితం మీద విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మాహత్యాయత్నం చేసిన పాల సురేష్ (44) పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సురేష్ కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోగం నయం కోసం పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి లక్షలు వెచ్చించి వైద్యచికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో జీవితం మీద విరక్తి చెంది గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం హుటాహుటిన జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. మూడు రోజుల అనంతరం పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

శంకరపట్నం, జూలై 2: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా మంగపేట మండలం కొత్తపేట గరెపెల్లి గ్రామానికి చెందిన చిల్ల సారయ్య రెండేళ్ల కూతరు అంజలితో కలిసి ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కొడూరి మొగిలి అనే వ్యక్తి మోటర్ సైకిల్‌పై కేశవపట్నం నుంచి లింగాపూర్ వైపు వెళ్తున్నాడు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు పక్క పక్కన ఢీ కొన్న ఘటనలో చిల్ల సారయ్యతో పాటు రెండేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. మొగిలికి స్వల్ప గాయాలు కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. గాయపడిన వారిని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, జూలై 2: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. నూతన వాహనాలకు స్వామి వారి సన్నిధిలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

● అంజన్నను దర్శించుకున్న వేములవాడ ఈవో

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా సోమవారం బాధ్యతలు చేపట్టిన వినోద్‌రెడ్డి మంగళవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేసి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. వినోద్‌రెడ్డి హనుమన్ జయంతి వేడుకలకు ఫెస్టివల్ అధికారిగా విధులు నిర్వహించారు.



అంజన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

● ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. డ్యామ్‌లోకి 4,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 10.835 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 15.986 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 465 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 4.615 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

హైవోల్టేజీ విద్యుత్‌తో గృహోపకరణాలు దగ్ధం

● రూ. రెండు లక్షల నష్టం

ఎల్లారెడ్డిపేట, జూలై 2: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాపేటలో మంగళవారం హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో పలువురి ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామంలో దేవేందర్, మైసయ్య, దేవదాస్, దర్వేశ్‌తో పాటు మరో పది మంది కాలనీవాసుల ఇళ్లలో ఒక్కసారిగా అధిక విద్యుత్ సరఫరా అవడం వల్ల ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులు హైవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మద్దతు ధరల చట్టం అమలు చేయాలి

● రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, జూలై 2: కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల చట్టం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఇటీవల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు సహేతుకంగా లేవన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న రైతుల పెట్టుబడిని పరిగణలోకి తీసుకోలేదని, మద్దతు ధరలను వెంటనే సవరించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 25శాతం పెరిగాయని, కేంద్ర వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చు తగ్గించి చూపిస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. కూరగాయలకు కూడా మద్దతు ధర ప్రకటించాలన్నారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాసిర సంపత్ రావు, శీలం అశోక్, కొప్పుల శంకర్, జక్కుల రమేష్, రావుల ఓదేలు, కుమార్, సమ్మయ్య, సంజీవ్, పోచయ్య, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చొప్పదండి, జూలై2: గత నెల 26న పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ ఉపేంద్ర చారీ తెలిపిన కథనం మేరకు మండలంలోని చాకుంటాకు చెందిన తడిగొప్పుల మహేందర్ (27) రెండు నెలల క్రితం 6లక్షల రూపాయలను అప్పు చేసి నగునూర్‌లో పెయింట్స్ దుకాణం ప్రారంభించాడు. వ్యాపారంలో నష్టంరావడంతో అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది గత నెల 26న ఇంటిలో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహేందర్ మృతి చెందినట్లు తెలిపారు. మహేందర్ తండ్రి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హుజూరాబాద్ రూరల్, జూలై 2: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో సోమవారం రాత్రి మృతి చెందగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన గాజబోయిన మల్లయ్య(37) అనే వ్యక్తి తన అత్తగారి తరుపున వచ్చిన పొలంతో పాటు అత్తగారి పొలం దున్నడానికిగాను బురద బట్టలు తీసుకుని సోమవారం సాయంత్రం వెళ్లాడు. మల్లయ్య ఫోన్‌కు భార్య లావణ్య ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. కాగా మంగళవారం ఉదయం అటుగా మల్లయ్య అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పొలం దున్నడానికి వెళ్లిన మల్లయ్య తన పొలం దగ్గరకు వెళ్లకుండానే మధ్యలో శవమై కనిపించాడు. చనిపోయిన చోట ట్రాక్టర్ రౌండ్‌లు వేసినట్లు ఉండటం, కొంచం ముందుకు వెళ్లేసరికి మళ్లీ అలాగే ఉండటం, చేతులకు దెబ్బలు తాకి రక్తం కారుతుండటంతో ఇది అనుమానాస్పద మృతిగా కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. విషయం పోలీసులకు తెలియజేయటంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



పొలంలో గాజ మల్లయ్య మృతదేహం మల్లయ్య(ఫైల్)

మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 2: మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన రుద్ర సత్తయ్య (46) అనే వ్యక్తి మంగళవారం అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సత్తయ్య డిష్ కాంట్రాక్ట్ తీసుకొని ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నష్టాలు రావడంతో గ్రామంలో కొందరి వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున తన భార్య పిల్లలు బయట నిద్రిస్తుండగా ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తయ్య భార్య రుద్ర మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



ఆజయ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 2: తంగళ్లపల్లి మండలం నేరళ్ల గ్రామానికి చెందిన యువకుడు ఐతం ఆజయ్ (26) మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం... గ్రామానికి చెందిన ఐతం విజయ కుమారుడు ఆజయ్ మద్యానికి బానిసయ్యాడు. తండ్రి సత్తయ్య 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి విజయ కూలీ చేస్తూ కుమారుడిని పెంచి పోషిస్తోంది. కొద్ది రోజులుగా మద్యానికి బానిసైన ఆజయ్ తల్లిని సైతం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు లేక మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన మినీ బస్సు

● డ్రైవర్‌కు తప్పిన ప్రాణాపాయం

సిరిసిల్ల క్రైం, జూలై 2: సిరిసిల్ల పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో మినీ బస్సు బోల్తా పడింది. మంగళవారం వేములవాడ నుంచి కామారెడ్డి వైపు వెలుతున్న మినీ బస్సు సిరిసిల్ల రెండో బైపాస్ రహదారిలో అదుపుతప్పి ఎదురుగా ఉన్న రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రమాద సంఘటనను చూసిన ఆ ప్రాంతంలోని రైతులు వెంటనే చేరుకొని డ్రైవర్‌ను బయటకు తీశారు. అతివేగంగా వెళ్లడం వల్లనే మినీబస్సు బోల్తాపడినట్లు స్థానికులు చెప్పారు. మినీబస్సులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో అక్కడికి వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

కుటుంబ సమస్యలతో యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

కోనరావుపేట జూలై 2: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోనరావుపేట మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు.. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన పల్లి శ్రీకాంత్ (37) అనే యువకుడు కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. భార్య మధూష ఆరోగ్యం బాగాలేక నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. శ్రీకాంత్ మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం ఉదయం కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లి మండల శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి తాగిన మైకంలో ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ బావి రోడ్డు పక్కనే ఉండడంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు బావిలో దూకుతుండగా చూసి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే బావిలో మునిగిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్ఐ ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు రిషిక్, కూతురు శాన్విక ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూలై 2: మండలంలోని పత్తికుంటపల్లె గ్రామానికి చెందిన గుడిసె బాలమల్లు (50) అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. బాలమల్లు మద్యానికి బానిస కావడంతో పాటు కుమార్తె వివాహం చేయడంతో అప్పులు అయ్యాయి. దీనితో భార్య ముత్తవ్వతో తరుచూ గొడవ పడుతుండేవాడు. రెండు రోజుల క్రితం ముత్తవ్వ హైద్రాబాద్‌లో ఉండే కుమారుడి వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

● వృద్ధుడికి గ్రామస్థుల దేహశుద్ధి

కాల్వశ్రీరాంపూర్, జూలై 2: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఓ గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికపై 65 సంవత్సరాల వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. గ్రామంలోని ప్రభుత్వ సామూహిక మరుగుదొడ్ల వద్దకు మంగళవారం బహిర్భూమికి బాలిక వచ్చింది. మద్యానికి బానిసైన అదే గ్రామానికి చెందిన వృద్ధుడు బాలికను వెంబడించి వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన అక్కడున్న గ్రామస్థులు వృద్ధుడికి దేహశుద్ధి చేసి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక కుటుంబ సభ్యులు ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు ఉమ్మడి జిల్లా బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై2: ఉమ్మడి జిల్లా బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించనున్నామని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ గణపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే ఉమ్మడి జిల్లా క్రీడాకారులను మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల రెండవ వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారిణిలకు 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబరు 31 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. క్రీడాకారిణిలు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, జనన ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9గంటలకు సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్యను మైదానంలో సంప్రదించాలని సూచించారు.

నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ వాహనాల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై2: పెండింగ్ చలాన్లు , వాహనాల నంబర్‌ప్లేట్ ట్యాంపరింగ్‌లపై కరీంనగర్‌లో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టుకున్నారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐలు కరీముల్లాఖాన్, పర్స రమేష్, ఆర్ఐ స్వామి, ఆర్ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ ఇషాక్ అహ్మద్, సిబ్బందితో కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట నాకా బందీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, సౌండ్ పొల్యూషన్ వెహికిల్స్‌పై ఉన్న 72 ఈ చలాన్లను వాహన యజమానుల నుంచి జరిమానాలు చెల్లింపు చేశారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, సౌండ్ పొల్యూషన్ ఉన్నచో కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ హెచ్చరించారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

ధర్మపురి, జూలై 2: ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద నల్ల మల్లేష్ (35) అనే తాపీ మేస్త్రీ సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి నిద్రలో మృతి చెందాడు. దండేపల్లి మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ ఆరు ఏళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చి తల్లితో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఎక్కడపడితే అక్కడే పడుకుంటున్నాడు. గత రాత్రి అతిగా తాగి కమలాపూర్ చౌరస్తా వద్ద పడుకొని ఉండగా నిద్రలోనే మృతి చెందాడు. మల్లేష్ తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేత

గణేశ్‌నగర్, జూలై 2: ఆర్బీఐ ఆదేశాల ప్రకారం యూపీఐ, సర్వీస్ ప్రొవైడర్లు ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, గూగుల్ పే, బ్యాంకుల ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం నుంచి టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ www.tgnpdcl.in ద్వారా లేదా టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా మాత్రమే కరెంట్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. టీజీఎస్పీడీసీఎల్ యాప్‌లో గానీ లేదా డిస్కం వెబ్‌సైట్‌లో గానీ బిల్లులు చెల్లించునప్పుడు మీరు ఫోన్ పే, గూగుల్ పే, పేటీ ఏం, లేదా ఇతర యూపీఐని వాడవచ్చు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యాష్ కార్డ్ కూడా వాడవచ్చు. ఎన్‌పీడీసీఎల్ బిల్‌డెస్క్ ద్వారా కూడా చెల్లించవచ్చు. ఏమైనా సందేహాలుంటే కరీంనగర్ సర్కిల్ కంట్రోల్ రూమ్ సెల్‌నెం.9440811444లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ రూరల్, జూలై2: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం టాస్క్‌ఫోర్స్, కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. గొల్లపల్లి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ పోలీసులు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

రైతుల సహకారంతో సొసైటీ పురోభివృద్ధి

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, జూన్ 2 : రైతులు, విండో డైరెక్టర్ల సహకారంతో సొసైటీ గడిచిన పదేళ్లలో ఎంతో పురోభివృద్ధి సాధించిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం మండలంలోని భూషణరావుపేట సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన బీపీసీఎల్ పెట్రోల్ పంపు ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రైతులతో ఏర్పడ్డ సహకారం సంఘాలు నానాటికీ బలోపేతం కావడం శుభ సూచకమని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్ల వంటి వ్యాపారం చేస్తూ ఆర్థిక స్వావలం బన సాధిస్తున్నాయన్నారు. ప్రస్తుతం సొసైటీ రు. 15 కోట్ల టర్నోవర్‌తో రైతు లకు వివిధ రకాల సేవలందిస్తోందని గుర్తు చేశారు. సొసైటీ పరిధిలోని 13 గ్రామాలకుగాను 12 గ్రామాల్లో గోదాములు నిర్మించుకున్నట్లు చెప్పారు. అయితే రైతులకు మరింత సకాలంలో సేవలందించాలనే ఉద్దేశ్యంతో మూడు సొసై టీలుగా విభజించాలనే ప్రతిపాదనతో తీర్మాణం చేసి పంపించామని తెలిపారు. కేడీసీసీ మేనేజర్ రఘునందన్ శర్మ మాట్లాడుతూ సొసైటీలు బ్యాంకులకు దీటుగా రైతులకు సేవలందిస్తున్నాయని డిపాజిట్లు పెంచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. బీపీసీఎల్ ఏరియా మేనేజర్ శరణ్ జిత్, జడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ చైర్మన్ మిట్టపల్లి లక్ష్మీగంగారెడ్డి, ఎంపీటీసీలు కొండ ఆంజనేయులు, వేముల గంగరాజం, దేవేంద్రగంగా రెడ్డి, ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తెరిపించిన సీడీపీవో

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కలికోటలో అంగన్‌వాడీ కేంద్రం తెరిపించిన సీడీపీవో

కథలాపూర్, జూలై 2 : మండలంలోని మారూమూ గ్రామమైన కలికోటలో ఆయా, అంగన్‌వాడీ టీచర్ లేని కారణంగా కొంత కాలంగా నిర్వాహణ లేకపోవడంతో ఈ నెల 1న 'కలికోటలో అంగన్‌వాడీ కేంద్రం మూత' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంకు అధికారులు స్పందించారు. మంగళవారం మెట్‌పల్లి ప్రాజెక్ట్ శిశు సంక్షేమ అధికారిణి (సీడీపీఓ) తిరుమలాదేవి కేంద్రంను సందర్శించారు. గిరిజన తండాలో విధులు నిర్వర్తిస్తున్న జయ అనే అంగన్‌వాడీ టీచర్‌ను కేంద్రంను రెగ్యులర్‌గా నడిపించాలని ఆదేశించారు. వెంటనే గ్రామంలోని చిన్నారులను కేంద్రంకు తెప్పించి ప్రీస్కూల్‌తో పాటు పౌష్టికాహారం అందించారు. ఆయా లేకపోవడం వల్ల కేంద్రం నిర్వాహణ ఎలా చేయడమనేది సందిగ్ధంలో పడింది. ఇదిలా ఉండగా సీడీపీవో తిరుమలాదేవి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రభుత్వం ఖాళీలను తొందరలోనే భర్తీ చేసే ప్రక్రియ చేపట్టనుందని తెలిపారు.

మాజీ మంత్రి శ్రీనివాస్‌కు నివాళులు



మెట్‌పల్లిలో డీఎస్‌కు నివాళులర్పిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

మెట్‌పల్లి, జూలై, 2 : మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో పట్టణంలోని మున్నూరు కాపు సంఘంలో ఆయనకు నాయకులు నివాళులర్పించారు. మంగళవారం సంఘం భవనంలో మాజీ మంత్రి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం పట్టణాధ్యక్షుడు ఓజ్జెల శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్య స్థాయి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప ఆదర్శ ప్రాయుడని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర చాలా విలు వైందని, అలాంటి నాయకుడు మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లైసెట్టి శంకర్‌పటేల్, పుప్పాల నగేష్, బైన మహేష్, మార్గం నరేష్‌కుమార్, సుతారి లింగారెడ్డి, రాజేందర్, రమేష్‌రాజ్, రాజ్‌కుమార్, రంజిత్, పవన్‌కుమార్, భూమారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

'సఫాయి అప్నావో బీమారీ భగావో'..పై అవగాహన

విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించిన అధికారులు



వాల్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు మున్సిపల్ అధికారులు

కోరుట్ల, జూలై 2 : స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సఫాయి అప్నావో బీమరీ భగావోపై మంగళవారం పట్టణంలోని బాలికల పాఠశాలతో పాటు అంగన్ వాడి కేంద్రాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంబంధించిన వాల్ పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి మున్సిపల్ అధికారులు ఉపాధ్యాయలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు నీటి నాణ్యతపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో శుభ్రంగా ఉంచుకునే విధంగా విద్యార్థులు తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేసి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసి స్టెంట్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

మెట్‌పల్లి, జూలై, 2 : వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజలతో మమేకమవుతు మెట్‌పల్లి పట్టణంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పర్యటించారు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కుండపోతగా భారీ వర్షం కురిసింది. దీంతో ముంపు ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండడానికి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ భరోసా కల్పించారు. వర్షపు నీరు రోడ్లపై ఎక్కడ నిలిచిందో పరిశీలించి మున్సిపల్ అధికారులకు తెలయజేస్తూ అప్రమత్తం చేస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు.



వర్షంలోనే పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

అమ్మ ఆదర్శ పాఠశాల.. పనులు త్వరగా పూర్తి చేయాలి



మెట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

● వర్షపు నీరు ఇళ్లలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి, జూలై, 2 : ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల, మురికి కాలువలు, ముంపు ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణంలో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని, శిథిలవ్యవస్థలో ఉన్న తరగతి గదులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులకు అందజేసి పాఠ్య పుస్తకాలు పరిశీలించి, ఉపాధ్యాయుల రిజిస్టర్ పరిశీలించి నంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలని, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పరిశీలించినంతరం మురికి కాలువలు, ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలంలో పట్టణంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై నీటి నిల్వలు ఉండకుండా, ఇండ్లల్లోకి వర్షపు నీరు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో మురికి కాలువలు సరిగా లేవని శానిటేషన్ పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. శానిటేషన్ పనులను నిరంతర చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్, మున్సిపల్ కమిషనర్ మోహన్, ఎంఈవో భీమయ్య, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

● కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మెట్‌పల్లి పట్టణంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులు చేపట్టినంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, భోజనం నమోదు, మెనూ, టైం టేబుల్, స్టాక్ వివరాలు, గుడ్డు పరిమాణం, నాణ్యతను పరిశీలించారు. కేంద్రంలోని చిన్నారులను బరువు, ఎత్తు నమోదును పరిశీలించి ప్రతి నెల నిర్వహించాలని సూచించారు. కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతల హాజరు నమోదులు చేస్తున్న ఎన్‌హెచ్‌టీఎస్ మొబైల్ యాప్‌ను పరిశీలించారు. కేంద్రాలోని చిన్నారులకు పోషక పదార్థాలు అందేలా చూడాలని, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పోషక పదార్థలు, గుడ్లను ప్రతి ఒక్కరి అందేజేయాలని, పోషకాహారంపై అవగాహన కల్పించాలని పలు సూచనలు చేశారు. ఈయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్, మున్సిపల్ కమిషనర్ మోహన్, జిల్లా సంక్షేమ అధికారి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్, అధికారులు పాల్గొన్నారు.

● ఇసుక అక్రమ నివారణపై చర్యలు చేపట్టాలి

కోరుట్ల రూరల్ : ఇసుక అక్రమ రవాణా నివారణపై అధికారులు పగడ్బందీ చర్యలు చేపట్టాలని, నింబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని కలెక్టర్ సత్యప్రసాద్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. మంగళవారం మండలంలోని సంగెం గ్రామాల శివారులోని జమిగడ్డి ప్రాతంలో నూతనంగా నిర్మాణం చేయనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. నాగులపేట గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్పీ ప్రధాన కాల్వపై నిర్మాణం చేసిన సైఫన్‌ను పరిశీలించిన కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాపై అధికారుల తీరుపై ఆరా తీసారు. గతంలో ఇసుక అక్రమ రవాణాలో ఎన్ని వాహనాలను సీజ్ చేసారని ఆర్డీవో ఆనంద్ కుమార్‌ను ప్రశ్నించగా కేసు నమోదు చేసిన వాహనాలకు జరిమానాలు విధించామని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. కోరుట్ల సంగెం గ్రామ శివారులోని జమ్మిగడ్డె ప్రాంతంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి కావలసిన 20 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థలంకు సంబంధించిన రికార్డులను పరిశీలించి హద్దులు నిర్ణయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్‌లతో పాటు జిల్లా రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సంగెం శివారులో కలెక్టర్‌కు స్థలం వివరాలను తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్

గొల్లపల్లి, జూలై 2 : వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటి డీఎంహెచ్‌వో డా. ఎన్. శ్రీనివాస్ స్థానికులకు సూచించారు. మంగళవారం గొల్లపల్లి మండలం గుంజప దుగు గ్రామంలో ఆయన వైద్యారోగ్య శాఖ సిబ్బందితో కలిసి ఇంటింటా పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, బోదకాలు, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారాలను డ్రై డేలుగా పాటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో గట్టు శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు నరేందర్, ద్వారకా, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలి

పెగడపల్లి : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించి వ్యాధుల బారిన పడకుండా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ మంగళవారం సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, వర్షాకాలంలో వచ్చే వ్యాదులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యాతో వైరల్ ఫీవర్స్ గూర్చి అవగాహన కల్పించి వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా తాగు నీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పెగడపల్లి మండల వైద్యాధికారి నరేష్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సునీత, వైద్యసిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వానాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి రూరల్, జూలై, 2 : వానాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పట్టణానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు స్థానిక కౌన్సిలర్లతో కలిసి కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెళ్లి చేసుకొని దరఖాస్తులు చేసుకున్న ఆడ బిడ్డల అందరికి కల్యాణ లక్ష్మి పథకం అందేలా చేస్తాన్నన్నారు. కురుస్తున్న వర్షాలతో ప్రజలు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చేందకుండా వైద్యుల సూచనలు పాటించలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, తహసీల్దార్ శేఖర్, కౌన్సిలర్లు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

మల్యాల, జూలై 2: మండలంలోని నూకపల్లి అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గంను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉమ్మడి నర్సయ్య. ఉపా ధ్యక్షుడిగా మ్యాకల నర్సయ్య, కోశాదికారిగా చెలుమల్ల దేవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

గడువులోగా దుస్తులు అందించాలి

జగిత్యాలరూరల్, జూలై 2 : నిర్దేశించిన గడువులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని ఏపీఎం గంగాధర్ మహిళసంఘాల సభ్యులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, కండ్లపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో మహిళసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు కేంద్రాలను మండల ఏపీఎం ఓడెల గంగాధర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రూరల్, అర్బన్ మండలాల్లో 10 మహిళ శక్తి కుట్టు కేంద్రాల ద్వారా రెండవ దశలో యూనిఫాం ల తయారీని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీసీ రవీందర్, వీవోఏలు రమ, అధ్యక్షురాళ్లు సత్తవ్వ, పద్మ, లావణ్య, రాజ్యలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

శివాజీ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

కోరుట్ల రూరల్, జూలై 2 : చత్రపతి శివాజీ పోరాట స్ఫూర్తితో యువకులు ముందుకు సాగాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహక సాయి మధుకర్ అన్నారు. మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో మంగళ వారం చత్రపతి శివాజీ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని గ్రామస్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మదుకర్ మాట్లాడారు. హిందు సామ్రాజ్య స్థాపనకు శివాజీ మహారాజు చేసిన పోరాటం గొప్పదన్నారు. విశ్వహిందు పరిషత్ జిల్లా ప్రదాన కార్యదర్శి గజం రాజులతో పాటు శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

కోరుట్ల, జూలై 2 : పార్లమెంట్ సాక్షిగా హిందువులపై విషం చిమ్మిన మతోన్మాది రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయ్యాలని పట్టణ బీజేపీ, బీజేవైఎం శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రపతి తీర్మానం ప్రసంగించిన వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే తీవ్రమైన వాఖ్యలు రాహుల్ గాంధీ చేయడం విడ్డూరమని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా హిందువులపై చేసిన రాహుల్ గాంధీకి ప్రతి పక్ష నేతగా కొనసాగించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ పెండం గణేష్ బీజేపీ, బీజేవైఎం నాయకులు మాసం ప్రసాద్, పోతుగంటి శ్రీనివాస్, జక్కుల ప్రవీణ్ కుమార్, కసుల గంగాధర్, కటకం వినయ్, రంజిత్ రావు, గుండేటీ సంజీవ్ పాల్గొన్నారు.

అన్నిగ్రామాలను అభివృద్ధి చేస్తాం

బుగ్గారం జూలై 2: బుగ్గారం మండలంలోని అన్ని గ్రామాలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకరంతో అభివృద్ధి చేసుకుంటామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్ అన్నారు.ఈ మేరకు మండలంలోని గంగాపూర్ వయా యాశ్వంతరావు పేట గ్రామం నుంచి మండల కేంద్రం వరకు ఉన్న రోడ్డు గుంతల మయం కావడంతో మట్టి రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి అధ్యక్షుడు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లడుతూ గంగాపూర్ రోడ్డు వర్షకాలం రావడంతో మండల కేంద్రానికి రావడనికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కి విన్నవించగా సంధింత అధికారులకు పనులు ప్రారంబించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఈ రోజు పనులు ప్రారంబించామని అన్నారు. త్వరలో బీటీ రోడ్డు పనులు కూడ ప్రారంబిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రేంటం శ్రీధర్,మమిడాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, జూలై 2 : నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ తిరుపతి దుకాణ దారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పలు దుకాణాలలో ప్లాస్టిక్ నిలువలను స్వాధీనం చేసుకోని, కిరాణ దుకాణాలలో విక్రయిస్తున్న తినుండారాలను పరిశీలించి తేదీ ముగిసిన వాటిని విక్రయిస్తున్నట్లు గుర్తించి వారిపై జరిమానాలను విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేదించిందని ప్రజలకు వాడకం మాని పర్యావరణానికి సహకారం అందించాలని అన్నారు. దుకాణ దారులు తమ దుకాణాలలో తినుబండారాలు తేదీ ముగిసినవి గుర్తించి విక్రయించవద్దని సూచించారు. ఈ కార్యక్రమం లో వార్డు అధికారి ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై సంబరాలు

కథలాపూర్, జూలై 2 : పదేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న సూరమ్మ పనులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రు. 80 కోట్లు విడుదల చేయించడం పట్ల కథలాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల పనులు ముందుకు సాగలేవని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రతీ ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని రైతులను మోసగించారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు రైతుల పక్షపాతిగా ఉందని చెప్పడానికి నిధుల విడుదలే నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్యే చిత్తశుద్ధితో ప్రభుత్వంను ఒప్పించి నిధులు తెచ్చారని అన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, లింగంగౌడ్, గంగాధర్, హరిప్రసాద్, ఆకుల సంతోష్, లింగారావు, చౌదరి ఉన్నారు.

ప్రజల్లో ఉన్న వారికి ఎళ్లప్పుడూ గుర్తింపు ఉంటుంది

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ఎంపీపీ మారు సాయిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 2 : పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉన్న వారికి ఎళ్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని ఎంపీ టీసీలు, సర్పంచులతో పాటు పాలకవర్గం ఐదు ఏళ్ల పదవి కాలం పూర్తి కావడంతో ఎంపీపీ మారు సాయిరెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిం చారు. పదవి కాలం పూర్తి చేసుకున్న సర్పంచులు, ఎంపీటీసీలను శాలువలతో సన్మానించారు. ఐదేళ్ల పాలనలో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి సహకరించిన ఎంపీపీ మారు సాయిరెడ్డిని మాజీ సర్పంచులు, ఎంపీటీ సీలు శాలవలు, గజమాలతో సన్మానించి, జ్ఞాపిక లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతన పంచాయతీ రాజ్ చట్టానికి రూపకల్పన చేసి గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. కేసీఆర్ అడుగు జాడలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సర్పంచులు, ఎంపీటీ సీలు కీలక పాత్ర పోషించార న్నారు. గ్రామీణా భివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర మరువలేమన్నారు. ఎంపీపీ మారు సాయి రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లు మండలాన్ని అన్ని రంగాల్లో అభి వృద్ధి చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ టీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, అధికా రులు పాల్గొన్నారు.

గుంతల తవ్వకం పనులు ముమ్మరంగా చేపట్టాలి

కథలాపూర్, జూలై 2 : వన మహోత్సవలో భాగంగా మొక్కలు నాటడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో గుంతల తవ్వకం పనులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీవో ప్రవీణ్ సూచించారు. మండలంలోని గంభీర్‌పూర్‌లో మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు.

రోడ్డుకు ఇరువైపుల గుంతలు తవ్వించి సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త, చెదారం లేకుండా చూ డడంతో పాటు మురికి కాలువలు శుభ్రంగా ఉం చాలని చెప్పారు. పలు ఇళ్లను తిరిగి వ్యక్తిగత పరిశుభ్రత గురించి గ్రామస్తులకు వివరించారు. గోళాల్లో నీరు నిల్వ ఉంచడాన్ని గమనించి పా రిశుధ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో పారబో యించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్య దర్శి శేఖర్, సిబ్బంది ఉన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సత్కారం

మల్యాల, జూలై 2: ఎంపీపీ ఆగంతం రవళీ, ఎంపీటీసీలకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సత్కారం చేశారు. బుధవారంతో అయిదేళ్ల కాలపరిమితి ముగుస్తుండడంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీ రవి ఎంపీటీసీలు కొల్లూరి గంగాధర్, దొంగ అనిత, మరాఠి సంజన, సంగని రవి, మారంపల్లి నర్సవ్వ, సఫీయవలీభేగం, క్యాతం పద్మ తదితరులను శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, మండల కోఆప్షన్ అజర్ కార్యాలయ అధికారులు నాగరాజ్, మోహన్, శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● సర్వసభ్య సమావేశం

ఎంపీపీ ఆగంతపు రవళి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మల్యాలలో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సమావేశానికి అధిక సంఖ్యలో మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో స్వాతి, అధికారులు పాల్గొన్నారు

● అవిశ్వాస డబ్బుల పంచాయతీ

రెండు నెలల క్రితం జరిగిన ఎంపీపీ విమల అవిశ్వాసం సందర్భంగా ఖర్చు అయిన డబ్బుల విషమమై మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద గొడవ చోటు చేసుకుంది. విమలపై అవిశ్వాసం నెగ్గాక మల్యాల-1, మ్యాడంపల్లి ఎంపీటీసీలు ఆగంతపు రవళి, ముదుగంటి వనిత ఎంపీపీ పదవి ఆశించి ఖర్చు పెట్టారు. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో ఎక్కువ ఖర్చు పెట్టుకున్నట్లు చెబుతున్న రవళి ఎంపీపీగా ఎన్నికయ్యారు. తాము రూ.2 లక్షల నగదుతో పాటు ఇతరాత్రా రూ.3లక్షలు ఖర్చయ్యాయని కొందరు సభ్యులు తమకు మద్దతు ఇవ్వకుండా అన్యాయం చేశారని తమ డబ్బులను చెల్లించాలని ఎంపీటీసీ వనిత డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నారాయణ మరి కొందరు చర్చించారు. రూ.లక్ష ఎంపీటీసీ వనితకు చెల్లించడానికి నిర్ణయించి కాగితం రాసివ్వడంతో పంచాయతీ సద్దుమనుగింది. అనంతరం వనితతో పాటు మాజీ ఎంపీపీ విమల వర్గీయులు సమావేశానికి గైర్హాజరయ్యారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ